# కరువు కాలం

[చిన్నకథ]

•

## శ్రీ బొమ్మిరెడ్డిపల్లి సూర్యారావు

అప్పడు చిన్నప్పటినుంచి ఒక రెండెడ్ల బండి పెట్టికొని, సంతలకి తోలి, అక్కడ మిరపకాయలు, ఉల్లిపాయలు, ఎండుచేపలు తెస్తే, భార్య నసి, వీథిలో బండరాయిమీద దుకాణం పెట్టి అమ్మేది. వాళ్లిద్దరూ గంజినీళ్లు తాగి ఒక మడిచెక్క ఆర్జించారు. కూతురికి పట్నపు సంబంధం చేశారు. కొడుకు నారాయుడు ఎదగగానే, పొలంమీద మూడువందలు అప్పు చేసి, జట్కాబండి కొన్నాడు అప్పడు ఇప్పుడు బాగా ముసిలాడయేడు. ఇప్పుడు బండీ ఎడ్లు లేవు. మడిచెక్కమాత్రం మిగిలింది.

అప్పడు ఇంటి కొచ్చి వీథిలో పొగాకు నములుతూ కూర్చున్నాడు. చీకటిపడుతూంది. నారాయుడు పొద్దున్న జట్కాబండి పట్నం తోలుకెళ్లి ఇంకా రాలేదు. నరిసి పొయ్యిలో నిప్పేసి బయటి కొచ్చింది.

"ఏటే, ఈడే టింకా పికరే చేదు. పెందకడ సద్దిగంజి తాగి పోనాడు. దీపాలెట్టే ఏలయింది"

వాడు ఇటికి రాకపోతే అప్పడికి బెంగ, చీకాకున్నూ.

"ఎటో బేరం తగిలిందిగోవోసు" అంటూ నరిసి, బురదయిన కాళ్ళకడియాలు చీరెకొంగుతో తుడిచింది.

"ఏటో ఎకవకుంక. సిన్నతనంగాదు, సికకతనంగాదు"—చిరాగ్గా అన్నాడు.

"ఆడి నెందు కేటి తిడతావు? ఆ డేటి నేసినాడు ?

"అదుగో నీనుంచే ఆ డొట్టి పోకిరీ అయిపోనాడు. ఇంక ఆడు నన్నాదుకొనే దేటి ?"

"నేక నేక ఒక్కడు పుట్టినా డీ కడుపుకి—"

"సాలూ, కోవే. నీ దొట్టి మూరకత్వం—"

"పోసే, సిరిపరపాళ్లు బొట్టి నిస్తామన్నారుగదా—ముడెట్టేరాదా ?"

"అదే సూసినాను—తులం బంగారమెడతారట. రెండుతులా లెట్టమన్నాను. ఏదో సూసి ముడెట్టిపొమ్మంటాను ఎదవని—"

"బాగుందినేరా—సత్తిగాల పోడాడు—"

"ఓసోస్, నీకే ఎరికే? ఆ డేసాలు—ఆడూ—, ఆడి సెరాయి, సొక్కా, వోస. న్నాని! పెందలకా డెలతాడు. మాపిటి కొస్తాడు. మూడు రూపాయలు దొరికాయంటాడు. అద్దరూపాయి తాగేస్తాడు,

పావలా కబ్బులో తినేస్తాడు. అణా బీడీలు కాలిసేస్తాడు. ఈడి బతుక్కి- బీడీలు, కబ్బులు, వోనననూనెలు! ఇంటికి రెండు రూపాయిలిస్తే-గడ్డికీ, ఉలవలకే అవుతాంది రూపాయిన్నర. దీని సిగతరగా-పావలా ఉలవలు ముప్పావలా అయినాయి! ఏం పిదుం! ఇంక పొయ్యిమీదికి గింజ లేటి తేవాల? ఆ అప్పెలా తీరుతాది? రాసీ, సెబుతాను. సెప్పినమాట ఇన్నాడా సరే, నేదా పెల్లి నేసేసి, ఏరుపోయి వొండుకో మంటాను. పోసీ, నాకు కొడుకు పుట్టే నేదనుకుంటాను—"

ఆ రోజు అప్పడి చిరాకుకి కారణం ఇంట్లో బియ్యం లేవు. ఊళ్ళో ఎక్కడా దొరకవు. సన్నాసినాయుడు పెళ్లాంమాత్రం రూపాయికి శేరుచొప్పున అమ్ముతోంది. నారాయుడొస్తే పోసీ, అలాగే తెద్దా మనుకున్నాడు. వాడూ—లేడు, డబ్బూ లేదా.

బాగా చీకటిపడింది. నారాయుడు "గంగరమె దివాలీ" అని పాడుకుంటూ జట్కా నిలబెట్టాడు. గుర్రాన్నిప్పి సాలలో కట్టేసి, ఊగుతూ, జోగుతూ లోపలికొచ్చి వంటపొయ్యిదగ్గర కూర్చున్నాడు.

"బేగి కూడెట్టే—" ఎర్రగా చింత నిప్పుల్లా ఉన్న కళ్లు మూతలుపడుతున్నాయి.

"గింజ లేవీ?" నరిసి అప్పడికి వినబడకుండా అంది. కాని అప్పడివి పాముచెవులు.

"ఓ రబ్బోయ్, నువ్వు గడింసేసిన డబ్బుకి కూడొకటి! సిగ్గునేని నమిడీకొడకా, ఎతుల్లినావురా ఈ ఏల దాకా—"

"ఉసనుకి బేరం తోలినాను"-నారాయుడు ఇంట్లోపిల్లి, బయట కోతి.

"ఏటి దొరికిందీపొద్దు?"

"రెండు"

"పొద్దంతా తోలినావు"

"నన్నేటి సెయ్యమంటావు? అంతే"

"ఓరె! ఎంత పనికిమాలినోడివయినావురా" నిస్పృహగా కూర్చున్నాడు.

"తేరా ఆ రెండూను. రూపాయి ఉలవలు, రూపాయి గింజలూ తెత్తాను" అన్నాది నరిసి.

నారాయుడు జేబులోంచి రూపాయి తీసి ఖంగున పడేశాడు.

"ఓ రూపాయి కరుసయిపోనాది—"

"రూపాయి కరుసే! ఓలమ్మ రూపాయి తాగేసినాడే" నరిసి ముక్కుమీద వేలేసుకుంది.

"ఏరా, రూపా యేటి సేసినావు?" అప్పడు గద్దించాడు.

"కరుసయిపోనాది. అద్ద రూపాయి తాగినాను; అద్దరూపాయి మద్దినాళ్ళ చినీమా కెల్లేను"

"ఓలమ్మో, ఎంత పోకిరయిపోనాడు" నరిసి నెత్తీ నోరూ కొట్టుకుంది. కళ్ళంట నీళ్లు రాకపోయినా నరిసి ప్రతీదానికీ ఒట్టి కొట్టినే ఏడుస్తుంది.

"పోసీ, కడుపుకి తాగినాడంటే నేనేటంటాను? ఎదవకుంకకీ ఏసాలేటి?" —అప్పన్న కోపంగా పెదవికరిచాడు. అప్పడి దృష్టిలో తాగడం అవసరం; గొప్పకూడాను. కాఫీక్లబ్బులు, బీడీలు, సినీమాలు మాత్రం విలాసాలు.

"పోరా, నాయింటోంచి పోయి ఏరే ఒండుకో. నువ్వేటి, నాకు గంజినీళ్లోసేదేటి?

నాకు కొడుకే నేడనుకుంటాను. పో—సీ! సిగ్గునేని జలమ ఎత్తగానే సరా?"

"ఒరే, రూపా యిచ్చినావు, గుర్రాని కేటెట్టడం, గింజ లేటి తేవడం సెప్పు" చేతిలో రూపాయి పట్టుకొని ఆలోచిస్తూంది నరిసి.

నారాయుడు మెల్లిగా లేచి కుక్కిమంచం మీద కుక్కలా ముడుచుకొని పడుకున్నాడు.

"ఈ డేటో గట్టెక్కిస్తాడని బెమపడ్డాను-ఏటో నాకరమం!" అనుకుంటూ, వీధిలో అడుగులు చప్పుడయితే చూడామని వెళ్లేడు అప్పుడు.

"ఎవుడ్రోరయ్యా! ఆవల"

"నేనురా, సిన్నోడిని"

"ఏటిరోయ్, బావమరిది! ఎటినుం చేటి—?"

"నకిడాం ఎల్లేను; ఇలా సూసిపోదామని..."

"ఒసేయ్, మీ సిన్నోడొచ్చినాడే"

కోర మీసాలు, తలపాగా, ఎర్ర బనీను, గోచీ, చేతిలో మువ్వలకర్ర, కిర్రు జోడూ తయారయాడు అప్పడి బావమరిది చినోడు. వాడి నందరూ పలకరించారు. కాని అందరికీ చింతగానే ఉంది ఇంట్లో బియ్యం లేవని.

"కూకోరా, ఇం కిప్పు డేటెల్తావు? కూడుతిని తొంగుని, కోడికూసేజాముని లేసి ఎల్దుగాని—" అప్పడు ఇంట్లో బియ్యం లేక పోయినా చుట్టాన్ని ఉండమని, బావమరిది దగ్గర తన దర్జా చూపించాడు. బావమరిది కాళ్ళు కడుక్కుని గోడకి జారపడి చుట్ట వెలిగించాడు.

నరిసి గుండెల్లో రాయి పడింది. వీధిలో చుట్టం - ఇంట్లో బియ్యం లేవు - చేతిలో ఉన్నది రూపాయి - ఇంకెక్కడా అప్పు దొరకదు. అప్పడిని సైగచేసి పిలిచింది.

"గింజలు నేవు -"

"ఆ రూపా యెట్టి తే-"

"గుర్రానికి ఉలవలో -?"

"మరేటిసేస్తం—గడ్డిపడే—"

నరిసి పెరట్లోంచి వెళ్లి సన్నాసి నాయుడి పెళ్ళాందగ్గరనుంచి రూపాయి బియ్యం తెచ్చి వండింది. సేరుబియ్యం ముగ్గురికి సరిపోయాయి. పొద్దుటి అంబలి మిగులుంటే తాగి పడుకుంది నరిసి.

అప్పడూ, బావమరదీ వీధిలో పడుకుని చుట్టలు కాలుస్తున్నారు. ఆ గాఢ చీకట్లో ఆ చుట్టలు నిప్పుకణాల్లా వెలుగుతున్నాయి.

"మీ ఊళ్ళో కరు వెలా గుందేస్" అన్నాడు బావమరిది.

"గోరమేన్రా! పెపంచం బగ్గున మండిపోతేంది-రూపాయికి శేరు—"

"ఈ వూర్లో మోతుబర్లే నేరు. మీకు మరీ సికాకు.—"

"ఏదో బగమంతుడి దయవల్ల మాకంత నేదులే—" అప్పడు దర్జాగా అని, తుప్పున ఉమ్మి, అటునుంచిటు వొత్తిగిల్లి నిశ్చింతగా పడుకున్నాడు.

ఎదురుగుండా, చీకటిలో, మర్రిచెట్టు మీద గుడ్లగూబ కూసింది.

సాలలో అస్థిపంజరంలా ఉన్న గుర్రం ఆకలిగా సకిలించింది.